క్లుప్తంగా

ఉపాధి కూలీ రూ. 600 ఇవ్వాలి



నారాయణపేట: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజుకు కూలి రూ.600 ఇవ్వాలని, ఏడాదిలో 200పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బాల్‌రాం డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని జాజాపూర్ పెద్ద చెరువులో ఒండ్రుమట్టి తీత పనుల్లో ఉన్న కూలీలతో వారు మాట్లాడారు.. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ నీళ్లు, ఓఆర్ఎస్ పాకెట్స్, అయోడిన్ వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గతమూడు నెలలనుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం కూలీలతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ ప్రవీణ్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శివకుమార్, కూలీలు నర్సింహులు, మన్నె రాజేష్, మల్లేష్, శ్రీనివాసులు, జయమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయాలి



మరికల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సీసీరోడ్లు లేక రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. దాదాపు ఇక్కడ 200లకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు రహదారులు బురదమయంగా మారి ఇళ్లకు వెళ్లలేని పరిస్థితులు దాపరించాయి. సీసీరోడ్లు వేయాలని కాలనీవాసులు రెండేళ్ల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి బీసీ కాలనీలో సీసీరోడ్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



మద్దూరు: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో మండలంలోని చాణిక్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, సీపీఐఎంఎల్ డివిజనల్ పార్టీ కార్యదర్శి నర్సింహులు, పీవైఎల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అంజి, సభ్యులు కాశీ, గౌష్ గురువారం తెలిపారు. స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నేటి రాజకీయ పరిస్థితులలో యువత ప్రశ్నించే ధోరణి అలవర్చుకోవడానికి, సమస్యలపై పోరాటం చేయడానికి ఈ తరగతులు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ తరగతులకు పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ నాయకుడు రాము విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృత్యువాత

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షంతో పిడుగుపాటుకు గురై రెండు ఎద్దులు మృత్యువాత పడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. అమ్మపల్లికి చెందిన రైతు బలరాజు పశువుల మేతకోసం అడవికి తీసుకెళ్లగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం రావడంతో పశువులను పక్కనే ఉన్న పశువుల కొట్టానికి తరలించుకుపోతున్న సమయంలో పిడుగుపడటంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. మృతిచెందిన ఎద్దుల విలువ దాదాపు రూ. 60వేల వరకు ఉంటుందన్నారు. సంబంధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంఈఓ కార్యాలయానికి చేరిన నోట్ పుస్తకాలు

మద్దూరు: నూతన విద్యా సంవత్సరంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందజేయడానికి గురువారం మద్దూరు ఎమ్మార్సీకి 36వేల నోట్‌పుస్తకాలు వచ్చినట్లు డీఈఓ అబ్దుల్ ఘని తెలిపారు. మండలంలోని దాదాపు 3వేల 500 మంది విద్యార్థులకు ఈ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పుస్తకాలను ఎమ్మార్సీలో బద్రపర్చామన్నారు. వీటిని డీఈఓ, ఏఎంఓ విద్యాసాగర్ పరిశీలించారు.



రేషన్ కోసం తిప్పలు

- నూతన పంచాయతీలో కానరాని రేషన్‌షాపులు
- దూర ప్రాంతాల నుంచి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రేషన్ షాపులను ఏర్పాటుచేయాలని వేడుకోలు
- స్పందించని అధికారులు



బైరంపల్లికి పంచాయతీ ట్రాక్టర్‌లో బియ్యం తీసుకెళ్తున్న లబ్ధిదారులు (ఫైల్)

మాగనూర్: ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకెళ్లేందుకు పేదప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాల్లో రేషన్ దుకాణాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేషన్ దుకాణాల నుంచి బియ్యం తమ ఇళ్ల కు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులే రూ. వంద వరకు అవుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

8కిలో మీటర్ల నుంచి తీసుకెళ్తున్న లబ్ధిదారులు

గ్రామీణ ప్రాంతలైనా బైరంపల్లి, ఒబ్లాపూర్, పర్మన్‌దొడ్డి, నేరడగందొడ్డి, పూంజనూర్, పెగడబండ, అచ్చంపేట మండలాల్లోని మారుమూల గ్రామాల్లో రేషన్ దుకాణాలు కరువయ్యాయి. బైరంపల్లిలో రేషన్ దుకాణం లేకపోవడంతో వీరంతా ఐదుకిలో మీటర్ల దూరంలో ఉన్న ఉజ్జెల్లిలోని చౌకధార దుకాణం నుంచి తెచ్చుకుంటున్నారు. దీంతో రానుపోను ఖర్చులతోపాటు బియ్యం ఇంటింకి తీసుకెళ్లేందుకు రూ. 80వరకు ఖర్చు చేస్తున్నారు. అదేవిధంగా ఒబ్లాపూర్ నూతన పంచాయతీగా ఏర్పడిన కూడా నేటికి చౌకధార దుకాణం ఏర్పాటు చేయకపోవడంతో ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్యరం గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటుండటంతో దాదాపుగా ప్రతినెల రవాణా చార్జీలకే రూ. 50నుంచి రూ. 100 వరకు ఖర్చు చేస్తున్నారు.

కొంత బియ్యం అమ్మి ఆటో చార్జి చెల్లించి..

గ్రామీణ ప్రాంతంలో వర్షధారిత పంటలపైనే గ్రామీణ ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తారు. పేద ప్రజలు కావడంతో ప్రతి నెలా బియ్యం తరలించేందుకు ఆటో చార్జీ కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నారు. దీంతో కొంత సమయంలో కొంత రేషన్ బియ్యం కిరాణ దుకాణాల్లో విక్రయించి ఆటో చార్జీలు చెల్లిస్తున్నారు.

పట్టించుకుని పాలకులు, అధికారులు..

తమ గ్రామంలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తే మాకు బాధలు తప్పుతాయని పేర్కొంటున్నారు.

ప్రతి నెల రూ. 80 ఖర్చు అవుతుంది



ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యం ఇంటికి తెచ్చుకునేందుకు ప్రతి నెల రూ. 80 ఆటో చార్జీ ఖర్చవుతుంది. మా గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో బియ్యం తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నాం. అధికారులు దృష్టి సారించి మా గ్రామంలో లేదా పంచాయతీ కార్యాలయంలోనైనా బియ్యం పోయాలి.

\- తాయప్ప, బైరంపల్లి గ్రామస్తుడు

చాలా కష్టమవుతుంది..



ప్రతి నెల మరో గ్రామానికి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే చాలా కష్టమవుతుంది. రేషన్ బియ్యం సరఫరా చేసే సమయంలో కొన్ని సార్లు పనులు ఉండటంతో వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షకాలం అయితే సరైన రహదారి లేక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన రేషన్ షాపులు మంజూరు చేయాలి.

\- మంజుల, గ్రామ మాజీ సర్పంచ్ బైరంపల్లి

సమస్య పరిష్కరిస్తాం..



మండలంలోని మారుమూల ప్రాంతాల్లో రేషన్ షాపు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల నుంచి వచ్చిన వినతుల మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకోసారి నివేదికను పరిశీలించి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

\- సతీష్‌కుమార్, తహసీల్దార్ మాగనూర్

వైభవంగా బసవేశ్వరస్వామి రథోత్సవం



ఊట్కూర్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట రూరల్: స్థానిక సరాఫ్‌బజార్‌లోని శ్రీ బసవేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు బుస్సయ్యస్వామి నేతృత్వంలో వైభవంగా పూజలు కొనసాగాయి. ఆలయంలోని బసవేశ్వరుడు, వీరభద్రేశ్వరుడి మూలవిరాట్‌కు మంజునాథ్, విశ్వనాథ్‌స్వామి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో, భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రేవంత్, చెన్నుస్వామి, జయప్ప, బసప్ప, బాల్‌లింగం, రవి, రాజేష్, కన్నశివ, భరత్, అప్పి, రుతీష్, శరణ్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పడమటి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం సాయంత్రం భక్తుల కనుల పండుగగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని రథంలో ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. ఉదయం గ్రామ పురవీధులో కళశం ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని కొల్లూరులో పౌర్ణమి సందర్భంగా నర్సన్నతాతా ఆలయం వద్ద రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కృష్ణయ్యగౌడ్, అశోక్‌గౌడ్, ప్రవీన్‌కుమార్, ఎల్కోటి నారాయణరెడ్డి, సూర్యప్రకాష్ రెడ్డి, బాల్‌రెడ్డి, దొబ్బలి హన్మంతు, లక్ష్మీకాంత్‌రెడ్డి, నర్సింహారాజుగౌడ్ పాల్గొన్నారు.



సరాఫ్‌బజార్‌లో బసవేశ్వరస్వామి రథోత్సవం

ఆంజనేయస్వామి పల్లకీ సేవ

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో గురువారం ఈశ్వర ఆంజనేయస్వామి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు.. భక్తులు భజనలు చేస్తు జల్దిబిందె ఊరేగింపుగా తీసుకొచ్చి దేవతమూర్తుల విగ్రహాలకు జల, పంచమృతాభిషేకం చేసి ఉత్సవాల ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. శుక్రవారం ఉదయం రథోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



జల్దిబిందెను ఊరేగిస్తున్న భక్తులు

వరికొయ్యకు నిప్పు పెట్టొద్దు..

మరికల్: యాసంగిలో సాగుచేసి కోతవేసిన కొయ్యకు నిప్పు పెట్టవద్దని ఏఓ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. వరికొయ్యకు నిప్పు పెట్టడంతో భూమిలో పంటకు మేలు చేసే వానపాములు మృతిచెందే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా భూసారం కూడా తగ్గుతుందన్నారు. రైతులు అందజేసిన జీలుగ విత్తనాలను రెండు ఎకరాలకు ఒక ప్యాకెట్ బస్తా చొప్పున పొలంలో చల్లాలని సూచించారు. వానాకాలం పంటలను సాగు ముందు వ్యవసాయ శాఖ అధికారులు సంప్రందించి పంటలను సాగుచేసుకుంటే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గౌతమ బుద్ధుడు ఓ దిక్సూచి



పేటలో వేడుకల్లో పాల్గొన్న సంఘం నాయకులు



నర్వలో..

కోస్గి: ప్రపంచ జ్ఞానోదయ నిర్మాత సిద్దార్థ గౌతమ బుద్ధుడి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గుండుమాల్ మండల పరిధిలోని బోగారంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు పాల్గొని బుద్ధుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నియోజవర్గ ప్రధాన కార్యదర్శి కృష్ణ, వెంకటమ్మ, అంజమ్మ, భీమమ్మ, శిరీష, పల్లవి పాల్గొన్నారు.

నర్వ: ఆధ్యాత్మిక, ఆరోగ్య సమాజ నిర్మాణానికి గౌతమ బుద్ధుడు ఓ మార్గదర్శి, దిక్సూచి అని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. గురువారం బుద్ధ పౌర్ణమి సందర్భంగా మండలంలోని నందీశ్వర పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీలో ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన కేంద్రంలో భక్తులు ధ్యానం చేశారు. అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. బుద్ధుడి బోధనలు అందరికి ఆచరణీయమన్నారు. ధ్యానంతో ఆరోగ్యం, ఆత్మవికాసం కలుగుతాయన్నారు. ధ్యాన సొసైటీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, బాలకృష్ణరెడ్డి, సంఘం నర్సింహులు, సత్యనారాయణరెడ్డి, సుజాత, ఉమాపతి, శైలజ, సత్యమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



మద్దూరు: మద్దూరుకు చెందిన బర్ల నందు పదోతరగతి ఫలితాల్లో జీపీఏ 10/10 సాధించడంతో గురువారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని మీ తల్లిదండ్రులు పేరు తీసుకొస్తూ సమాజానికి సేవా చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



ధన్వాడ: కుష్టు వ్యాధిపై ప్రజలకు సరైన అవగాహన ఉంటే వ్యాధిని వీలైనంతవరకు నిర్మూలించవచ్చని లెప్రసీ రాష్ట్ర టీం మెంబర్ డాక్టర్ సంపత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ మేరకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఆశాకార్యకర్తల ద్వారా ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహించడంతోపాటు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కీర్తి, డీపీఎంఓ వెంకటేశ్వర్లుచారి, సాకలరెడ్డి, వీరభద్రప్ప, కతలప్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ, డీసీఎం ఢీ : తప్పిన ప్రమాదం



మాగనూర్: మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ ఆలయం వద్ద గురువారం తెల్లవారుజామున లారీ డీసీఎం ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా నుంచి హైదరాబాద్ వైపుకు ఇనుప లోడ్‌తో వెళ్తున్న లారీ జడ్చర్ల నుంచి వరిధాన్యం లోడ్‌తో రాయచూర్‌కు వెళ్తున్న డీసీఎం ఢీకొన్నాయి. అయితే లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఎడమ వైపు వెళ్లాల్సిన లారీ ఒక్కసారిగా కుడివైపునకు రావడంతో తప్పించబోయి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అదృష్టవశాత్తు ఎవరకి ఎలాంటి గాయాలు కాలేదు. స్థానిక ఏఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రెండు వాహనాలను క్రేన్ సాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు.

జూన్ 23న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలు

అమరచింత: ప్రత్యూష డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్, అనిల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలను అమరచింతలో ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు చిన్న, సూరి, భరత్ తెలిపారు. ప్రత్యూష డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ 15వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ చేతుల మీదుగా గురువారం విడుదల చేశారు. ఆసక్తి గలవారు నంబర్ 95424 04616, 73862 70804 ఫోన్‌చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

షీటీంపై అవగాహన పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని, షీటీమ్స్‌పై అవగాహన కల్గి ఉండాలని ఏఎస్ఐ శ్రీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని ఏయిడెడ్ వైదిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఎస్ఆర్ సమ్మర్ క్యాంప్‌లో బాలికలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీం పొందాలని అన్నారు. విద్యా సంస్థల్లో తోటి విద్యార్థులు, టీచర్లు చదువుకుంటున్న బాలికలతో ఎవరైనా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అదేవిధంగా అధికంగా సెల్‌ఫోన్ వినియోగంతో కలిగే నష్టాలు తెలియజేస్తూ సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని వివరించారు. కార్యక్రమంలో బాలరాజు, నమీనా తదితరులు పాల్గొన్నారు.

బాల కేంద్రం తనిఖీ

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రం మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బాలకేంద్రాన్ని గురువారం స్థానిక తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాల కేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డితో మాట్లాడి నిర్వహణ తీరు, పిల్లల హాజరు తెలుసుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయికి వెళ్లిన కళాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతో పాటు కళలలో ప్రావీణ్యం సంపాదించుకునేందుకు తల్లిదండ్రులు కళారంగంవైపు ప్రోత్సహించాలన్నారు. అందరికి అందుబాటులో ఉన్న వేసవి శిక్షణ శిబిరానికి చిన్నారులను పంపించాలని, తబల, నృత్యం, గాత్రం, చిత్రలేఖనం తదితర విషయాల్లో శిక్షణ తీసుకోవాలని, నిర్వాహకులు అందించే సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంగ నర్సింహులు, లక్ష్మణ్, వసంత్, రామకృష్ణ, జ్ఞానామృత పాల్గొన్నారు.



విద్యార్థుల్లోని కళలను పరిశీలిస్తున్న తహసీల్దార్

వేసవి శిక్షణ శిబిరాలతో అదనపు నైపుణ్యం



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘనీ

కోస్గి: పాఠశాలల సెలవు దినాల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలతో చదువుతోపాటు పలు రంగాల్లో అదనపు నైపుణ్యం సాధించవచ్చునని డీఈఓ అబ్దుల్ ఘని సూచించారు. ఈ మేరకు గురువారం గుండుమాల్ మండలంలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత నెల రోజులుగా కొనసాగిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో పాఠశాలలకు సెలవులు ఇవ్వగానే విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ శిబిరంలో పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామస్తులు, దాతల సహకారంతో 30 రోజులపాటు విద్యార్థులకు రైటింగ్, రీడింగ్, డ్రాయింగ్, నృత్యం, క్రాఫ్ట్, సింపిల్ మ్యాథ్స్‌లో శిక్షణ నిర్వహించిన పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణను డీఈఓ అభినందించారు. శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి లక్ష్మీ, ఏఎంఓ విద్యాసాగర్, విశ్రాంత హెచ్‌ఎం గురునాథ్‌రెడ్డి, పీఎస్‌హెచ్‌ఎం గిరిజ, శిబిరం వాలెంటర్లు విజయలక్ష్మీ, వెంకటేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం



ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



కొనేరులో స్నానం ఆచరిస్తున్న భక్తులు

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ప్రభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9గంటల ప్రాంతంలో వేద పండితులతో స్వామివారి కల్యాణమహోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఈ నెల 21న ప్రారంభమైన స్వామి వారి బ్రహ్మోత్సవాలు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. అలాగే శుక్రవారం తెల్లవారు జామున ఐదు గంటలకు స్వామివారి రథోత్సవం, సాయంత్రం 5గంటలకు పాల ఉట్లు కార్యక్రమం ఉంటుంది. స్థానిక ఎస్ఐ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వామి దర్శనంలో మాజీ ఎమ్మెల్యే..

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కారించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటాలి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసిన జిల్లా జట్టుతో నిర్వాహకులు



పరుగుపందెంలో పోటీపడుతున్న క్రీడాకారులు

నారాయణపేట రూరల్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు క్రీడారంగంలో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నవీరయ్య అన్నారు. అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా జూన్ 2,3వ తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియను గురువారం చేపట్టారు. స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌కు 8 నుంచి 20 సంవత్సరాల మధ్య గల బాల, బాలికలు వేర్వేరు విభాగాల్లో పోటీలకు హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలని, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నర్సింహులు, రమణ, జగదీష్, రాజు, శ్రీలత, పీఈటీలు పాల్గొన్నారు.

కనులపండువగా స్వామివారి కల్యాణోత్సవం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో గురువారం లక్ష్మి నరసింహ స్వామి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. రఘుప్రేమ్ జోషి శాస్త్రబద్ధంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, ప్రత్యేక పూజలు, భజన, పల్లకీసేవ, మహారథోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగాయి. అలాగే, చిన్నారి చిన్మాయి నత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నర్సింహచారి, అనిల్ దేశాయి, అనంతరావు, గురురాజ్, గోపినాథ్, నరసింహా,శ్రీధర్‌రావు, భీంషెన్‌రావు, శేషూ, రవి, ప్రహ్లద్ , భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు